# సేంద్రియ ఎరువులు











ICAR

కృషి విజ్ఞాన కేంద్రము

హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా

కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ

సైదాబాద్ పోస్ట్, సంతోష్‌నగర్, హైదరాబాదు - 500 059

Citation : సాంబ్రాజ్యం ఏ., రామకృష్ణ వై.యస్., రెడ్డి వై.వి.ఆర్., ప్రసాద్ ఎమ్.ఎస్., మరియు మరద్ పి.కె., సేంద్రియ ఎరువులు (టెక్నికల్ బులెటిన్) 9/2006. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, సైదాబాద్ పోస్ట్, సంతోష్‌నగర్, హైదరాబాదు - 500 059. 12 పేజీలు

September, 2006

© All rights reserved

*Published by*

**Dr. Y.S. Ramakrishna**
Director
Central Research Institute for Dryland Agriculture
Santoshnagar, Hyderabad - 500 059.
Phone : 040-2453 0177 (O), 2453 2262 (R)
Fax : 040-2453 1802 / 2453 5336
Web : http://crida.ernet.in
Email : ramakrishna.ys@crida.ernet.in

Printed at : **Sree Ramana Process Pvt. ltd.,**
S.D. Road, Secunderabad - 3. Phone : 040-27811750

# సేంద్రియ ఎరువులు

పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఉత్పాదకత, రైతులను, శాస్త్రవేత్తలను, పర్యావరణవేత్తలను నేడు తీవ్రమైన ఆందోళనకు గురిచేస్తున్న అంశం. ఆహార అవసరాలను తీర్చటానికి లభ్యమయ్యే వనరులు పరిమితంగా ఉన్నాయి. కాబట్టి పరిమిత వనరులతో అధిక ఉత్పాదకత సాధించగలగాలి. ఈ కోణంలోచూస్తే వ్యవసాయ భూముల యాజమాన్యంలో సేంద్రియ ఎరువులు ముఖ్యపాత్ర వహిస్తాయి. ఆధునిక వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం అధికమయిన దరిమిలా రైతులు సాంప్రదాయకంగా వాడిన సేంద్రియ ఎరువులను విస్మరిస్తున్నారు. రసాయనిక ఎరువుల వాడకం పూర్తిగా నిరోదించలేకపోయినా తగ్గించటానికి ప్రయత్నం చేయాలి. సేంద్రియ ఎరువుల వాడకంవల్ల రసాయనిక ఎరువులకయ్యే ఖర్చు తగ్గటమే కాకుండా భూసారం పెరిగి, భూ భౌతిక స్థితిగతులు మెరుగుపడి మొక్కలు ఏపుగా పెరిగి, పంటల దిగుబడులు పెరుగుటతోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుటకు, వాతావరణ కాలుష్యనివారణకు కూడా తోడ్పడుతుంది.

## సేంద్రియ ఎరువు తయారీకి వాడు పదార్థములు :

**వ్యర్థపదార్థములు :** వ్యవసాయ వ్యర్థపదార్థాలైన మొక్కల అవశేషాలు, రాలిన ఆకులు, పచ్చి ఆకులు, ఎండు గడ్డి, పనికిరాని పాత వరి గడ్డి, పంట మొదళ్ళు, వేర్లు, పొట్టు, పశువులు తొక్కిన చొప్ప, పనికిరాని, కుళ్ళిన కాయగూరలు, పండ్లు మొదలగునవి.

**పశువుల పేడ :** ప్రతి టన్ను వ్యర్థపదార్థములకు 100 కిలోలు అవసరము

**మక్కిన పశువుల ఎరువు :** అవసరానిని, వీలును బట్టి రెండు, మూడు తట్టల ఎరువునువేసి బాగా కలియబెట్టడంవలన నాణ్యమైన ఎరువు త్వరగా తయారయ్యే అవకాశము ఉంటుంది.

**సూపర్ ఫాస్ఫేట్ / రాక్ ఫాస్ఫేట్ :** కంపోస్టు త్వరగా కుళ్ళడానికి దోహదపడుతుంది. ప్రతి టన్ను చెత్తకు 40-50 కిలోల వరకు వాడాలి.

# సేంద్రియ ఎరువు తయారీకి అనువైన పద్ధతులు...

## 1. నాడెప్ కంపోస్టు

నాడెప్ కంపోస్టు నారాయణ దియోరావ్ పండరిపాండే పేరు మీద వచ్చినది. ఈ నాడెప్ కంపోస్టు తయారీవలన వ్యవసాయ వ్యర్థపదార్థాలన్నీ ఉపయోగకరమైన కంపోస్టుగా తయారగుటే గాక గ్రామ పరిసర ప్రాంతాలు కూడా పరిశుభ్రంగా ఉంటాయి. ఈ నాడెప్ పద్ధతి ఒక్కటే గాలి తగులు పద్దతిలో (Aerobic) తయారయ్యే కంపోస్టు ఇది సాధారణ కంపోస్టుకంటే మూడింతలు ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది.

### కావలసిన పదార్థములు :

| | | |
|---|---|---|
| నాడెప్ కంపోస్టు గుంత | : | 4.5 x 1.5 x 1.05 మీటర్లు |
| వ్యవసాయ వ్యర్థ పదార్థములు | : | 1500 కిలోలు |
| ఆవుపేడ | : | 8-10 తట్టలు |
| మట్టి | : | 120 తట్టలు |
| నీరు | : | 1500-2000 లీటర్లు |

### నాడెప్ గుంత తయారీ

- ముందుగా గుంతకు ఎంచుకున్న స్థలము కొంచెము మెరక ప్రదేశములో నీరు నిల్వఉండకుండా ఉండేలా చూడాలి.
- ఇటుకలు, మట్టి, సిమెంటుతో 4.5 మీ. పొడవు, 1.5 మీ వెడల్పు 1.05 మీ ఎత్తుగల గుంతను నిర్మించాలి
- గుంతను కట్టునపుడు సరిపడినన్ని 12.5 x 10 సెం.మీ. పరిమాణము గల రంధ్రములను గోడలలో ఉండేలా కట్టాలి.
- గోడల క్రింద వరుసలన్నీ మట్టితో కట్టాలి.
- పైన రెండు వరుసలు మాత్రము సిమెంటుతో కట్టాలి.

## గుంతను నింపుట

- చిక్కని ఆవుపేడ కలిపిన నీళ్ళను గుంతలోపలి గోడలకు, గుంత అడుగు భాగములోను చల్లాలి



నాడెప్ కంపోస్టు



ఎ) చిన్నగా కత్తిరించిన వ్యర్థపదార్థములు, ఆకులు, గడ్డి, వేళ్ళు మరియు ఇతర వ్యవసాయ మిగులు పదార్థములతో 15 సెం.మీ. ఎత్తులో గుంతలో ఒక పొరలాగా వేయాలి. (ప్లాస్టిక్, గాజు, రాళ్ళు, రేకులు, రబ్బరు లేకుండా చూడాలి).

బి) 4 కిలోల ఆవుపేడను 125 లీటర్ల నీటితో కలిపి 'ఎ' పొరమీద చల్లాలి లేదా గోబర్‌గ్యాస్ నుండి వచ్చు పేడను (Slurry) కూడా వాడవచ్చు.

సి) 50 నుండి 60 కిలోలు ఎండబెట్టి జల్లించిన మట్టిని 'బి' పొరమీద వేయాలి.

- పైన చెప్పిన ఎ,బి,సి పొరలన్నీ కలిపి ఒక యూనిట్ అవుతుంది.
- అలాంటి యూనిట్‌లతో గుంత అంచులపైకి 50 సెం.మీ. ఎత్తు వచ్చువరకు వేస్తూపోవాలి.
- ఈ గుంతను 24-48 గంటలలోపు ఒకే దఫాలో నింపాలి. లేనిచో కంపోస్టులో నాణ్యత లోపిస్తుంది.
- 400-500 కిలోల మట్టిని నీరు, పేడతో ముద్దలా చేసి గుంతపైన 5-7.5 సెం.మీ. మందంలో మెత్తాలి.
- 15-20 రోజుల తరువాత గుంతలోని పదార్థములు 20-25 సెం.మీ. లోపలికి కుంగుతాయి.
- ఈ కుంగిన ఖాళీలో మరల కత్తిరించిన వ్యర్థపదార్థములను గుంతపైకి 45 సెం.మీ. ఎత్తువచ్చు వరకు వేసి తిరిగి పేడ, నీరు, మట్టి మిశ్రమంతో మెత్తాలి.
- తేమను కాపాడుటకు గుంతపైన నీరు చిలకరిస్తూ ఉండాలి.
- గుంతపైన పనికిరాని కలుపు మొక్కలు మొలచినచో పీకివేస్తూ ఉండాలి.
- పైన మెత్తిన పొరను తడిపిన గోనె సంచులతో కప్పి తేమను కాపాడాలి.
- 3-4 నెలల వ్యవధిలో మేలైన పోషక విలువలుగల ఎరువు తయారవుతుంది.
- గుంత నుంచి ఎరువును త్రవ్వితీసి ఒకరోజంతా ఎండలో ఆరనిచ్చి సన్నని జల్లెడలో జల్లించాలి.
- కుళ్ళని వ్యర్థపదార్థములను తిరిగి గుంతలోకి వాడవచ్చు.
- ఈ విధంగా రెండు గుంతలలో తయారైన ఎరువు 5 టన్నులు ఒక ఎకరాకు సరిపోతుంది.
- ఈ ఎరువు పోషక విలువల నిష్పత్తి నత్రజని, భాస్వరము, పొటాష్ 1:0.5:1.2గా నమోదు చేయబడినది.

# 2. కొంపోస్ట్ గుంత తయారీ

## కావలసిన పదార్థములు

| | | |
|---|---|---|
| గుంత | : | 3 x 2 x 1.5 అడుగులు |
| ఆవుపేడ | : | 60 కిలోలు |
| గ్రుడ్ల పెంకుల పొడి | : | 250 గ్రా. |
| రాక్‌డస్ట్ / బోన్‌మీల్ | : | 500 గ్రా. |
| బి.డి సెట్ | : | 502-507 |
| బెల్లం | : | 250 గ్రా. |

## గుంత తయారీ :

నీరు నిల్వ ఉండకుండా, నీడ ఉండి మంచి గాలి సోకు ప్రదేశములో 3 x 2 x 1.5 అడుగుల విస్తీర్ణములో ఇటుకలతో ఒక తొట్టిని నిర్మించాలి. తొట్టి అడుగు భాగములో ఇటుకలు వాడరాదు. తొట్టి లోపలి గోడలను, అడుగు భాగమును ఆవుపేడతో అలకాలి.



## తయారు చేయుపద్ధతి :

- ఆవుపేడను బాగా మర్ధనచేయాలి
- కోడి(గుడ్ల పెంకుల పొడిని, రాక్‌పౌడరు/బోన్‌మీల్‌ను ఆవుపేడ మీద చల్లి బాగా కలపాలి
- 2 లీటర్ల నీటిలో బెల్లమును కలిపి ఆ నీటిని పై మి(శమముపై చల్లాలి.
- పిదప ఈ పేడ మి(శమమును ముందుగా నిర్మించుకున్న గుంతలో వేసి 4-5 లీటర్ల నీటిని చిలకరించి 10-15 నిముషములు బాగా కలపాలి
- పేడ మి(శమముమీద 2 అంగుళములు లోతుగల 5 రం(ధ్రములను చేసి బి.డి 502 నుండి 506 లను కూర్చాలి.
- బి.డి 507ను ఒక లీటరు నీటిలో కలిపి 15 నిముషముల తరువాత గుంతలోని మి(శమముపై చల్లాలి.
- తడిపిన గోనెసంచిని పై మి(శమముమీద గుంతలో కప్పాలి.
- నెలలో రెండుసార్లు ఈ మి(శమానిని బాగా కలియబెట్టాలి.

## తయారీ సమయము :

ఈ కౌపాట్ కంపోస్టు లేదా యస్-9 తయారగుటకు 60-70 రోజుల వ్యవధి పట్టును.

## ఎరువు మోతాదు :

ఒక తొట్టి నుంచి 30 కిలోల కౌపాట్ గుంత ఎరువు తయారగును

## నిల్వ ఉంచు పద్ధతి :

ఈ సేం(ద్రియ ఎరువును మట్టి కుండలో, చీకటి (ప్రదేశములో నిల్వ ఉంచాలి. 6 నెలలలోపు పంటకు వాడాలి. నిల్వ ఉంచినపుడు కూడా తేమను కాపాడాలి.

## ఎరువు వాడు పద్ధతి :

ఒక ఎకరము విస్తీర్ణమునకు 5 కిలోల ఎరువును 20 లీటర్ల నీటిలో కలిపి ఒకరా(త్రి నాననివ్వాలి. మరుసటిరోజు సవ్యదిశలో (clock wise)

అపసవ్యదిశలో (anticlock wise ↺) 20 నిముషములు కలియబెట్టి సన్నని గుడ్డతో వడపోయాలి. దీనికి మరల 50 లీటర్ల నీటిని కలిపి పంట పై ఈ క్రింద ఉదహరించిన విధంగా పిచికారీ చేయాలి.

| | | |
|---|---|---|
| 2-3 ఆకుల వయసులో ఉన్నపుడు | : | ఒకసారి |
| పూత సమయములో | : | రెండవసారి |
| కోతసమయములో | : | మూడవసారి |

## విత్తన శుద్ధి / వేరు శుద్ధి :

- ఈ ఎరువును 2 శాతము బెల్లం నీటిలో కలిపి విత్తనాలకు పట్టించి విత్తన శుద్ధి చేయాలి.
- నారును నాటుటకు ముందుగా వేళ్ళను ద్రావణములో ముంచి, నీడలో ఆరబెట్టి నాటుకోవాలి.

## పనిచేయు విధానము :

- కౌపాట్ గుంత ఎరువు పంటమీద రెండు విధాలుగా పనిచేస్తుంది.
- 75-90 రోజుల ఎరువు మొక్కల రోగ నిరోధక శక్తిని పెంచుతుంది.
- 120 రోజుల ఎరువు భూమిలోని పోషక విలువలను పెంచుతుంది.
- సేంద్రియ ఎరువులలో వున్న హార్మోన్లు సబ్‌టిలిస్ ఒక్క పోషక విలువలు పెంచుటే కాకుండా, పంట ఎదుగుదలకు మరియు రోగనిరోధక శక్తిని పెంచుటకు మధ్య సత్సంబంధము ఏర్పడేలా పనిచేస్తుంది.

# 3. బయోడైనమిక్ కంపోస్టు

పచ్చి గడ్డి, ఎండు గడ్డి ఉపయోగించి బయో డైనమిక్ కంపోస్టును తయారు చేయవచ్చును.

## కుప్ప తయారు చేయుపద్ధతి :

- ముందుగా 5 x 2.5 మీ. వైశాల్యముగల మెరక ప్రదేశమును ఎంచుకోవాలి.
- మొదటి వరుసలో 20 సెం.మీ. ఎత్తులో ఎండు గడ్డిని, రెండవ వరుసలో 20 సెం.మీ. ఎత్తులో పచ్చి గడ్డిని పరవాలి.
- తరువాత 100-150 లీటర్ల పేడనీటిని చల్లాలి
- ఇదే పద్ధతిలో ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పేడనీటిని 1.5 మీ ఎత్తు వచ్చువరకు పేర్చుకుంటూ పోవాలి.
- బాగుగా కుళ్ళుటకు రాక్ ఫాస్ఫేటు (భాస్వరం), సున్నము (కాల్షియం), బూడిద (పొటాషియం)ను పొరల మధ్యలో చల్లాలి.
- ఒక బి.డి. సెట్ 502 నుండి 507 వరకు పొరల మధ్యలో 5-7 అడుగుల దూరంలో పెట్టాలి.
- ఈ కుప్పను మట్టి, పేడ కలిపిన మిశ్రమముతో మెత్తాలి.

**కాలవ్యవధి :** 8 నుండి 12 వారముల వ్యవధిలో తయారగును



## 4. జీవామృతము (1/2 ఎకరమునకు)

**కావలసిన పదార్థములు :**

| | | |
|---|---|---|
| ఆవుపేడ | : | 100-200 కిలోలు |
| ఆవు మూత్రము | : | 100 లీటర్లు |
| బెల్లం | : | 500 గ్రా. |
| నీరు | : | 300 లీటర్లు |

**తయారుచేయు పద్ధతి :** ఆవుపేడ, ఆవు మూత్రము, బెల్లం, నీరు బాగా కలిపిన మిశ్రమమును 10 రోజుల పాటు మూసి ఉంచిన తొట్టిలో పులియనివ్వాలి.

**వాడు పద్ధతి :** దీనిని 20 రెట్లు నీటిలో కలిపి అర ఎకరములో దున్నిన భూమిపై చల్లాలి. లేదా సాగు నీటితో కలిపి గాని సరఫరా చేయాలి.

**వాడుక విధానము :**

| | | |
|---|---|---|
| విత్తుటకు ముందు | : | ఒకసారి |
| విత్తిన 20 రోజులకు | : | రెండవసారి |
| విత్తిన 45 రోజులకు | : | మూడవసారి |



# 5. అమృతపాని

ఇది ఒక ద్రవరూపంలో తయారు చేయబడే సేంద్రియ/జీవన ఎరువు. దీనిని అప్పటి కప్పుడు తయారు చేసికొని వాడవచ్చును.

**కావలసిన పదార్థములు :**

| | | |
|---|---|---|
| తాజా ఆవుపేడ | : | 10 కిలోలు |
| తేనె | : | 500 గ్రా. |
| ఆవునెయ్యి | : | 250 గ్రా. |
| నీరు | : | 200 లీటర్లు |

**తయారు చేయు పద్ధతి :**

- ముందుగా ఆవుపేడను, తేనెను చిక్కగా కలపాలి
- తరువాత ఆవు నెయ్యిని వేసి ఎక్కువ వేగంగా కలియబెట్టాలి.
- ఈ కలిపిన ముద్దను 200 లీటర్ల నీరు ఉన్న తొట్టిలో కలపాలి

**వాడు పద్ధతి :** ఈ కలియ ఉంచిన మిశ్రమమును విత్తుటకు ముందుగా ఒక ఎకరములో చల్లాలి. రెండవ మోతాదును ఒక నెల రోజుల పైరుకు సాళ్ళ మధ్యలో చల్లటం గాని లేదా సాగు నీటితో కలిపి గాని పారించాలి.

**విస్తీర్ణము :** ఇది ఒక ఎకరమునకు సరిపడును.



# 6. వర్మి కంపోస్టు తయారీ

**పాక / బెడ్‌ల తయారీ :**

- పాక సుమారుగా 300 చ.అ (20 x 15 అ) వైశాల్యములో నిర్మిస్తే 15 x 3 x 1 1/2 అ.ల. బెడ్‌లు మూడు పెట్టుటకు వీలవుతుంది. ఈ బెడ్‌ల అడుగుబాగం గట్టిగా ఉండుటకు 15 సెం.మీ. మందంలో రాళ్ళు, కంకర, ఇటుకముక్కలు వేసి బాగా దిమ్మిశ కొట్టాలి.
- ఈ విధంగా ఏర్పరచుకున్న బెడ్‌లపై సుమారు 45 సెం.మీ మందం వరకూ పాక్షికంగా కుళ్ళిన వ్యర్థపదార్థాలు పరవాలి.
- దీనిపై 5-10 సెం.మీ. మందం వరకూ పేడను వేసి బెడ్ మొత్తం నీటితో తడపాలి.
- ఎల్లపుడూ 50-60 శాతం తేమ ఉండేలా జాగ్రత్తపడాలి.
- ఈ విధంగా వారం వరకు తేమ సరిపోయేలా నీటిని చల్లుతూ వారం తర్వాత బెడ్‌పై బొరియలు చేయని వానపాములను ప్రతి చదరపు మీటరుకు వెయ్యి వరకు వదలాలి.
- ఈ వానపాములు ఆహారాన్ని, తేమను వెతుక్కుంటూ లోపలకు వెళతాయి. ప్రతిరోజూ తమ బరువుకు తగ్గ ఆహారాన్ని తీసుకుంటాయి.
- బెడ్‌పైన తడిపిన పాత గోనెసంచులను పర్చిన తేమను కాపాడటమే గాక వానపాములను పక్షులు, చీమల నుండి కాపాడవచ్చు. కోళ్ళ బెడద లేకుండా జాగ్రత్తపడాలి.

**కాల వ్యవధి :** సాధారణంగా 2-3 నెలల్లో వర్మికంపోస్టు తయారవుతుంది.

**తయారయిన కంపోస్టు తీయు పద్ధతి :**

బెడ్ నుండి వర్మికంపోస్టు తీయడానికి 4, 5 రోజుల ముందు నుండి నీరు చల్లడం ఆపివేయాలి.

ఈ విధంగా చేయటంవలన వానపాములు తేమను వెతుక్కుంటూ లోపలికి వెళ్ళి అడుగుభాగంలో చేరతాయి.

బెడ్‌పైన ఉన్న గోనె సంచులను తీసివేయాలి. ఎరువును చిన్న, చిన్న కుప్పలుగా చేసికొని 2-3 సెం.మీ. జల్లెడతో జల్లించి సంచులలో నింపి నీడగల ప్రదేశంలో నిల్వఉంచుకోవాలి.

**వాడు పద్ధతి :** ఒక ఎకరానికి ఒక టన్ను వర్మీ కంపోస్టు ఎరువు వేయాలి. వర్మి కంపోస్టు అన్నిరకాల పంటలకు వేసుకోవచ్చు.

# వర్మికంపోస్టు వాడు విధానం

| పంట | మోతాదు ఎకరాకు | వాడు సమయం |
|---|---|---|
| వరి | 1 టన్ను | నాటిన తర్వాత |
| చెరకు | 1 ½ టన్నులు | దుక్కిలో |
| పత్తి | 1 టన్ను | దుక్కిలో |
| మిరప | 1 టన్ను | దుక్కిలో |
| వేరుశనగ | ½ టన్ను | దుక్కిలో |
| పొద్దు తిరుగుడు | 1 ½ టన్నులు | దుక్కిలో |
| మొక్కజొన్న | 1 టన్ను | దుక్కిలో |
| పసుపు | 1 టన్ను | దుక్కిలో |
| ద్రాక్ష | 1 టన్ను | దుక్కిలో |
| నిమ్మ, దానిమ్మ, బత్తాయి, రేగు, జామ | 2 కిలోలు ఒక్కో చెట్టుకు | చెట్టు నాటునప్పుడు 1-2 ఏళ్ళ వయస్సు చెట్లలో పూతకు ముందు |
| మామిడి, కొబ్బరి | 2 కిలోలు ఒక్కో చెట్టుకు<br>5 కిలోలు ఒక్కో చెట్టుకు<br>10 కిలోలు ఒక్కో చెట్టుకు<br>20 కిలోలు ఒక్కో చెట్టుకు | చెట్లు నాటినపుడు<br>1 నుండి 5 ఏళ్ళ చెట్లకు<br>6 నుండి 9 ఏళ్ళ చెట్లకు<br>10 ఏళ్ళపైబడిన చెట్లకు |
| ఉల్లి, వెల్లుల్లి, టొమాటో, బంగాళదుంప, బెండ, వంకాయ, క్యాబేజి, కాలీఫ్లవర్ మొ॥ | 1 నుంచి 1 ½ టన్నులు | దుక్కిలో |
| శ్రీగంధం, టేకు, ఎర్రచందనం, మాంజియం | 3 కిలోలు ఒక్కో చెట్టకు | చెట్టు నాటునప్పుడు |



# సేంద్రియ ఎరువుల వాడకంవలన లాభాలు

- మొక్కకు కావలసిన స్థూల, సూక్ష్మ పోషక పదార్థాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, కాల్షియం, మెగ్నీషియం, గంధకం, ఇనుము, జింకు, రాగి మొదలగు మూలకాలను సరఫరా చేస్తుంది.
- నేల భౌతిక స్థితిగతులను మెరుగుపరుస్తుంది. అంటే నీరు నిల్వ ఉంచే శక్తి, నేలలో గాలి ప్రసరణ, మట్టి రేణువులు ఒక దానికొకటి పట్టి ఉంచేశక్తి మెరుగుపడతాయి.
- భూసారం, నేల ఉత్పాదకశక్తి మెరుగవుతాయి.
- సేంద్రియ ఎరువుల వాడకం వలన భూమిలో సూక్ష్మపోషక పదార్థాల నిష్పత్తి మారుతుంది. దీనివలన భూమిలోని మొక్కలకు హాని కలిగించే నులిపురుగులు శిలీంద్రాలు కొంతవరకు అదుపులో ఉంటాయి.
- రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది.
- సేంద్రియ ఎరువుల నుంచి నత్రజని మెల్లగా విడుదల అవడం వలన నత్రజని నష్టం తక్కువగా ఉంటుంది.
- నేలలోని సూక్ష్మ జీవులకు మంచి ఆహారంగాను, అవి అభివృద్ధిచెంది చురుకుగా పనిచేయడానికి ఉపయోగపడుతుంది.
- పండ్లు, కూరగాయలు, ఇతర పంటలలో నాణ్యత పెరుగుతుంది.
- ఉప్పునేలలు, చౌడునేలలో లవణ, కార గుణాలు తగ్గించి పంటల దిగుబడులను పెంచడంలో దోహదపడుతుంది.
- బరువు నేలలు గుల్లబారి వేర్లు చక్కగా పెరగడానికి సహాయపడుతుంది. నీరు ఇంకడం పెరిగి మురుగు సౌకర్యం మెరుగవుతుంది.
- నీటిని గ్రహించి తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచే శక్తి పెరగడానికి దోహదపడుతుంది. బెట్ట పరిస్థితిని తట్టుకునే శక్తి పెరుగుతుంది.
- భూమిలోని వ్యాధికారక సూక్ష్మజీవులను నశింపచేసి మొక్కలకు రక్షణ కల్పిస్తాయి.
- మొక్కలలో వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది.
- వాడటం తేలిక, వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

ఇన్ని ఉపయోగాలు ప్రత్యక్షంగా కనిపిస్తున్నప్పుడు మనరైతు సోదరులు ఈ సేంద్రియ ఎరువులను సాధ్యమైనంతమేరకు వాడి లాభదాయక పథంలో పయనించాలని ఆశిద్దాము.






మరిన్ని వివరాలకు సంప్రదించండి :

**కృషి విజ్ఞాన కేంద్రము**

హాయత్‌నగర్, రంగారెడ్డి జిల్లా. ఫోన్ : 040-24200732

**కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ**

సైదాబాద్ పోస్ట్, సంతోష్‌నగర్, హైదరాబాదు - 500 059 ఫోన్ : 040-24530161, 24530177


ICAR

